PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 320 పేజీలు - 08 బుధవారం 14 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## సింగరేణి లాభాల్లో కార్మికుడి వాటా

# రూ.1,53,912

- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 దసరా బోనస్ వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** సింగరేణి బొగ్గు గని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా శుభవార్త అందిం చింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి రూ. 1,53,912, కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నిర్ణయంతో సింగరేణిలో పనిచేస్తున్న 38,737 మంది శాశ్వత ఉద్యోగులు, 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం కలగనుంది. సంస్థ మిగతా2లో...

# ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

- ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగించం: ప్రధాని మోదీ
- బలమైన ఆర్థిక పునాదులు, నిరంతర సంస్కరణలే వృద్ధికి ఆధారం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ అక్టోబర్13:** భారత్ ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగిస్తూ అభివృద్ధి చెందడం లేదని, ప్రపంచంతో కలిసి, ప్రపంచం కోసం ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై ముందుకు సాగుతోందని, నిరంతర సంస్కరణలు వృద్ధికి దోహదపడుతున్నా యని పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాలు, కీలక సాంకేతిక పరిజ్ఞానాలు, వనరుల కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా మిగతా2లో...

## ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు

పలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




## ఓటు చోరీపై

# ఐక్య పోరాటం

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం ఉధృతం
- ఇండియా కూటమి నేతల సమావేశంలో నిర్ణయం




**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మిగతా2లో...

## కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత




## హ్యామ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి.. ఇంజినీరింగ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు




**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** రాష్ట్రంలో చేపడుతున్న హ్యామ్ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇంజినీర్స్ భవన్‌లో నిర్వహించిన సంస్థాగత బలోపేత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో హ్యామ్ రహదారుల అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాలు, అమలు తీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7,448 కిలోమీటర్లకు పైగా హ్యామ్ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. రహదారులు కేవలం ప్రయాణ సౌకర్యాలకే పరిమితం కావని, ప్రజల జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు ఆస్పత్రులకు చేరడం, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందించడం, ప్రజల రాకపోకలు సులభతరం కావడంలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు సరిగా లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు అక్కడ పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్ల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల వేగంతో పాటు నిర్మాణ నాణ్యతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రహదారుల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంస్థలతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగతా2లో...

## 15 ఫీచర్లతో మీసేవా ధ్రువపత్రాలు

- చినిగిపోవు.. తడిసిపోవు.. లామినేషన్ అవసరం లేదు
- కొత్త విధానాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** హైదరాబాద్ ఇకపై మీసేవ కేంద్రాల ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలకు లామినేషన్ చేయించాల్సిన అవసరం లేదు. చినిగిపోకుండా, నీటితో తడిసినా త్వరగా దెబ్బతినకుండా ఉండే ప్రత్యేక మిగతా2లో...

## రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే యత్నం!




## జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

- అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ సహా పలువురు కార్యకర్తల నిర్బంధం




**తొలి అక్షరం/న్యూఢిల్లీ అక్టోబర్13:** దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా నిరసనలకు వేదికగా నిలిచిన జంతర్ మంతర్‌ను ఆందోళన స్థలాల జాబితా నుంచి మిగతా2లో...

# ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తోందని మోదీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, విదేశీ మారక నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయని చెప్పారు.పన్నుల విధానం, దివాలా పరిష్కార వ్యవస్థ, కార్మిక చట్టాల్లో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో జీడీపీలో నాలుగు శాతానికి పైగా ఉన్న కరెంట్ అకౌంట్ లోటు ప్రస్తుతం సుమారు అర శాతానికి తగ్గిందని వివరించారు. అనిశ్చితులతో నిండిన ప్రపంచంలో భారత్ విశ్వసనీయత, స్థిరత్వానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.

**ఇతరులకు అవకాశాలు కల్పించడమే నిజమైన శక్తి**

ఒక దేశానికి ఎంత శక్తి ఉందన్నది మాత్రమే కాకుండా, ఆ శక్తిని ఇతరులకు అవకాశాలు కల్పించేందుకు ఎలా ఉపయోగిస్తుందన్నదే ముఖ్యమని మోదీ అభిప్రాయపడ్డారు. తన అభివృద్ధి విధానాన్ని 'సాధికారత కల్పించే శక్తి'గా అభివర్ణించారు. పోటీ పడటానికే కాకుండా, ఇతరులతో కలిసి పనిచేయడానికి, ఇతరులు కూడా విజయం సాధించేలా సహకరించడానికి శక్తిని వినియోగించాలని సూచించారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, అంకుర సంస్థల విస్తరణ, స్వచ్ఛ ఇంధన సామర్థ్యాలు సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.

డిజిటల్ గుర్తింపు, చెల్లింపులు, ప్రజా మౌలిక సదుపాయాల రంగాల్లో భారత్ సాధించిన అనుభవాన్ని ఇతర దేశాలతో, ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలతో పంచుకుంటున్నామని చెప్పారు.

**అంతర్జాతీయ సహకారానికి పిలుపు**

సరఫరా వ్యవస్థలు, ఇంధనం, కీలక ఖనిజాలు, చెల్లింపుల వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం వంటివి అంతర్జాతీయ రాజకీయ ఒత్తిడికి సాధనాలుగా మారుతున్నాయని మోదీ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్వసనీయ భాగస్వాములు, సంక్షోభాలను తట్టుకోగల ఆర్థిక వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో భారత పాత్రను విస్తరించడం, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం సాధిస్తున్న పురోగతి భారతదేశానికే పరిమితం కాకుండా, ఇతర దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, పరిష్కారాలను అందించే అవకాశాలను కూడా సృష్టిస్తుందని మోదీ పేర్కొన్నారు.సంస్కరణలు తప్పనిసరి పరిస్థితుల్లో చేపట్టేవి కావని, అవి తమ దృఢ విశ్వాసానికి ప్రతీకలని ప్రధాని స్పష్టం చేశారు.

# ఓటు చోరీపై ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, తేజస్వి యాదవ్, సుప్రియా సూలే, ఎం.ఎ. బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, సంజయ్ రౌత్ తదితరులు హాజరయ్యారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, నిరసనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యక్తీకరణకు వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద నిరసనలను అడ్డుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తామని తెలిపారు.ఎన్నికల సంఘం పనితీరుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.

ఓటర్ల హక్కులను కాపాడేందుకు విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు, ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సీపీఐ నేత డి.రాజా జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించా లని కోరారు. ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు.

## రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు

# ఎసరు పెట్టే యత్నం!

**జీవో 17ను ఉపసంహరించుకోవాలి..**

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి**

**బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్**

**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** రైతు డిస్కం ఏర్పాటు పేరుతో వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే ప్రయత్నం జరుగుతున్నదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రైతు డిస్కం ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 17ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.రైతులు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు, రంగ నిపుణులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొత్త డిస్కం ఏర్పాటు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, తక్కువ వోల్టేజీ వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త వ్యవస్థతో ఈ సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కొత్త రైతు డిస్కం పరిధిలోకి 30,62,853 విద్యుత్ కనెక్షన్లను బదిలీ చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీటిలో 30,60,861 వ్యవసాయ కనెక్షన్లతో పాటు 512 ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణకు తగిన సిబ్బంది లేకపోతే తలెత్తే సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.కొత్త డిస్కంకు విద్యుత్ కేటాయింపులపైనా హరీశ్‌రావు సందేహాలు వ్యక్తం చేశారు. థర్మల్ విద్యుత్‌లో 25 శాతం, సౌర విద్యుత్‌లో 58 శాతం, జల విద్యుత్‌లో 100 శాతం కేటాయించినట్లు పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రధానంగా పగటిపూటే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఉత్పత్తి కూడా కాలానుగుణంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు.కొత్త డిస్కంకు భారీ మొత్తంలో అప్పులు, బకాయిలను బదిలీ చేయడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వానికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందో వెల్లడించాలని కోరారు. అదనపు పరిపాలనా ఖర్చులు, ఉద్యోగుల బదిలీ, ఆస్తులుఅప్పుల పంపిణీపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నష్టాల పేరుతో భవిష్యత్తులో రైతుల ఉచిత విద్యుత్‌పై ఆంక్షలు విధించే పరిస్థితి రాకుండా స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు.రైతుల అభ్యంతరాలను పరిష్కరించకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లవద్దని హరీశ్‌రావు ప్రభుత్వానికి సూచించారు. రైతు డిస్కం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, విద్యుత్ సరఫరా విధానం, ఆర్థిక నిర్వహణపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగింపుపై భరోసా ఇవ్వలేని పక్షంలో జీవో నంబర్ 17ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్

# ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

**తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు**

**పలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించడం తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు అని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కోమటిరెడ్డి భేటీ అయ్యారు. పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు.ఎన్‌హెచ్65 హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను జనవరిలో ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. కృష్ణా నదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అంగీకారం తెలిపారని వెల్లడించారు.



తెలంగాణలో ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని ఆదేశించినట్లు చెప్పారు. 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధుల కోసం కేంద్ర అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌హెచ్167కెపై కృష్ణా నదికి అడ్డంగా సోమశిల నుంచి సంగమేశ్వరం వరకు నిర్మించనున్న ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పూర్తయితే తిరుపతి వెళ్లే ప్రయాణికులకు సుమారు 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు. ఈ వంతెనతో పర్యాటక అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదం కలుగుతుందని తెలిపారు.తెలంగాణలో పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న భారతీయ రహదారుల కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారని చెప్పారు. రాష్ట్రం లో రహదారి వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించే ందుకు ఈ సమావేశం దోహదపడుతుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. ఈ భేటీలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

తొలగించిన మరుసటి రోజే సీజేపీ నేతలు అక్కడికి ప్రవేశించి నిరసన చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున జాతీయ జెండాలను చేతబూనిన కార్యకర్తలు బారికేడ్లు, గేట్లు దాటి జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ అప్పటికే మోహరించిన పోలీసులు సీజేపీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్, అజింక్య షిండేతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు జాతీయ జెండాలు పట్టుకుని 'భారత్ మాతాకీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

**నిరసన హక్కును అడ్డుకోలేరు**

జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా తొలగించడం, తమ పార్టీ నేతలను నిర్బంధించడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. జంతర్ మంతర్ కేవలం ఒక ప్రాంతం మాత్రమే కాదని, ప్రజల నిరసన హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. అధికారికంగా నిరసన వేదికను తొలగించ వచ్చేమో కానీ, ప్రజల స్ఫూర్తిని అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడాన్ని సీజేపీ నేతల విజయంగా అభివర్ణించారు. దేశంలో నియంతృత్వ ధోరణి కొనసాగుతోందని, పాలకులు నిబంధనలను విస్మరిస్తున్నారని విమర్శించారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత**

**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్13:** ఏజెన్సీ ప్రాంతాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎస్టీలకు దక్కాల్సిన 75 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది పోలీసు నియామక బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గిరిజన రిజర్వేషన్లను విస్మరించారని ఆమె ఆరోపించారు. గతంలో 2015, 2018, 2022 నియామకాల్లో ఈ రిజర్వేషన్లు అమలయ్యాయని గుర్తుచేశారు. తాజా నోటిఫికేషన్‌లో మార్పులు చేసి గిరిజన యువతకు న్యాయం చేయాలని కోరారు.ఈ నోటిఫికేషన్ వల్ల ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల గిరిజన అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని కవిత పేర్కొన్నారు. 400కు పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు గిరిజన యువతకు దక్కకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నియామక నోటిఫికేషన్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన యువతతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# సింగరేణి లాభాల్లో కార్మికుడి వాటా రూ.1,53,912

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది పన్నుల అనంతరం రూ.1,754 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా, అందులో 34 శాతం అంటే రూ.596 కోట్లను కార్మికులకు లాభాల వాటాగా పంపిణీ చేయనున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య కారణాలతో విధులకు దూరమైన కార్మికులు మెడికల్ బోర్డు కోసం కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆస్పత్రుల్లో ప్రతి నెలా బోర్డు సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 300 వారసత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు, సంబంధిత న్యాయపరమైన ప్రక్రియలను 15 రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కరోనా సమయంలో విధులకు హాజరుకాలేక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని ఒక్కసారి అవకాశం కల్పించే విధానంలో పరిశీలిస్తామని వెల్లడించారు.కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణికి చెందిన వినియోగంలో లేని భూములను గుర్తించి, అర్హులకు ఇంటి స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. శిథిలావస్థకు చేరిన డీ-టైప్ క్వార్టర్ల స్థానంలో నెహ్రూ కాలనీలను నిర్మించే అంశాన్ని కూడా ప్రస్తావించారు.గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల నుంచి వెలువడే దుమ్ము వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.సింగరేణి లాభాలు తగ్గడానికి గత ప్రభుత్వ హయాంలో బొగ్గు బ్లాకుల వేలంలో సంస్థ పాల్గొనకపోవడం కూడా కారణమని భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు బొగ్గు బ్లాకులను సాధించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఇంధన శాఖ ఉన్నతాధికారులు, సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# హ్యామ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఒప్పందాలను రద్దు చేసి ఇతర సంస్థలకు పనులు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు.హ్యామ్ రహదారులతో పాటు గ్రామ పంచాయతీ భవనాలు, ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల పనులను నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు అంకితభావంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి జగదీశ్వర్‌తో పాటు పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# 15 ఫీచర్లతో మీసేవా ధ్రువపత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

కాగితంపై వీటిని ముద్రించి అందించనున్నారు. ఇందుకోసం 15 రకాల అధునాతన భద్రతా లక్షణాలతో రూపొందించిన కొత్త విధానాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రజాభవన్‌లో ప్రారంభించారు.నకిలీ ధ్రువపత్రాల తయారీ, అనధికారిక నకళ్లను అరికట్టడమే లక్ష్యంగా ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్టు మంత్రి తెలిపారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఈ కాగితం సాధారణ వినియోగం, మడతపెట్టడం, దీర్ఘకాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుందని వివరించారు. భద్రతా కారణాల దృష్ట్యా 15 ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించడం లేదని పేర్కొన్నారు.జనన, మరణ ధ్రువపత్రాలతోపాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే పత్రాలు ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమని మంత్రి అన్నారు.

ఈ కొత్త విధానం ద్వారా ధ్రువపత్రాలను ఏళ్ల తరబడి మంచి స్థితిలో భద్రపరుచుకోవచ్చని, ప్రభుత్వ పత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.

# డిజిటల్ ఉచ్చులో మాస్టర్ మైండ్‌లు

- లోకార్డ్ మార్పిడి సిద్ధాంతం ముప్పు
- పదో తరగతి ఫ్రాడ్‌ల చేతిలో పీజీ పట్టభద్రులు బలి
- చదువు ఎంత ఉన్నా..అత్యాశ ఉంటే బుర్ర పనిచేయదు
- నాచరం ఎస్హెచ్ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ధనుంజయ



నాచరం ఎస్హెచ్ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ధనుంజయ

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** చదువుకున్నాం..పెద్ద ఉద్యోగం చేస్తున్నాం..మాకు టెక్నాలజీ బాగా తెలుసు అనుకుంటున్నారా? అయితే మీరు కచ్చితంగా ఈ వార్త చదవాల్సిందే.సమాజాన్ని వణికిస్తున్న సైబర్ నేరాల తీరుపై నాచరం ఎస్హెచ్ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ధనుంజయ యువతని, ప్రజలను నిద్రలేపేలా అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు.కేవలం పదో తరగతి లేదా నామమాత్రపు చదువులు చదివిన కొందరు కేటుగాళ్లు, మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసిన అత్యంత విద్యావంతులను సైతం తమ సైబర్ వలలో వేసుకుని నిలువునా మోసం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. **మోసాల వెనుక ఉన్న ప్రమాదకరమైన కోణాలు:** లోకార్డ్ మార్పిడి సిద్ధాంతం ముప్పు: ఫోరెన్సిక్ సైన్స్‌లో ప్రసిద్ధమైన లోకార్డ్ సిద్ధాంతం ప్రకారం..ఎక్కడైనా నేరం జరిగినప్పుడు నేరస్థుడు తన ఆనవాళ్లను అక్కడ వదిలి వెళ్తాడు అలాగే బాధితుడి నుంచి కొన్ని ఆధారాలను తీసుకువెళ్తాడు.డిజిటల్ ప్రపంచంలోనూ ఇదే సూత్రం వర్తిస్తోందని సీఐ ధనుంజయ తెలిపారు. సైబర్ నేరగాళ్లు మనం వదిలే చిన్న డిజిటల్ ఆధారాలు (డిజిటల్ ఫుట్‌ప్రింట్స్), సోషల్ మీడియా లొకేషన్లు వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించే మనల్ని మోసాల బారీ పడేస్తున్నారని హెచ్చరించారు.నేడు భౌతిక సంబంధాలు కనుమరుగై, కేవలం ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా ఏర్పడే నకిలీ పరిచయాలే ప్రజల పతనానికి నాంది పలుకుతున్నాయని స్పష్టం చేశారు. **అవాంఛిత లింకులు,మాయాజాలం:** ఇంటర్నెట్‌లో కనిపించే అవాంఛిత వెబ్‌సైట్లు,సెర్చ్ ఇంజిన్లలోని ప్రమాదకరమైన లింకులు,సోషల్ మీడియా చాటింగ్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను క్షణాల్లో తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. **ఈజీ మనీ వ్యూహం:** సెల్ ఫోన్ ద్వారా డిజిటల్ ప్రాపర్టీ పేరుతో క్షణాల వ్యవధిలో కోట్లు సంపాదించవచ్చనే అత్యాశే నేడు విద్యావంతుల పాలిట యమపాశంలా మారుతోందని ఆయన హెచ్చరించారు. **సీఐ ధనుంజయ హెచ్చరిక – ప్రజలకు పిలుపు:** ఒకవైపు మాస్టర్ డిగ్రీలు..మరోవైపు పదో తరగతి ఫ్రాడ్‌లు చదువుకు, మోసానికి సంబంధం లేదు.కేవలం మీ అజాగ్రత్తే సైబర్ నేరగాళ్లకు ఆయుధం అని సీఐ ధనుంజయ కుండబద్దలు కొట్టారు.సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన ప్రలోభాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అనే మాయమాటలను నమ్మి మోసపోవద్దని, సెల్ ఫోన్ వాడేటప్పుడు అణువణువునా అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అత్యాశకు పోయి కష్టపడి సంపాదించిన ఆస్తిని, జీవితాన్ని సైబర్ దొంగలపాలు చేయకండి..ఒక్క క్షణపు అప్రమత్తతే మిమ్మల్ని కాపాడుతుంది అని నాచరం ఎస్హెచ్ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ధనుంజయ సూచించారు.

# పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 13:** పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి హైదరాబాదులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం పట్ట భద్రుల నుంచి అత్యధికంగా కాంగ్రెస్ కు ఓట్లు పడేలా సహకరించాలని సర్వోత్తమ రెడ్డి కోరారు.నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మేరకు నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తు చేశారు. ఏందిరా నిరుద్యోగులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దసరాకు స్వగ్రామాలకు వచ్చే ఓటర్లను గుర్తించి నమోదు చేయిస్తామని గుర్తు చేశారు.ప్రజా ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

- పూల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది.. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ





**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 13:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను చౌటుప్పల్ బంగారుగడ్డలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో నిత్యం తీరికలేకుండా ఉండే వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తెలుపు రంగు దుస్తులు ధరించి బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆసుపత్రి వార్డులను రంగురంగుల పూలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆసుపత్రి ఆవరణలో ప్రతిష్ఠించారు. అనంతరం లయబద్ధంగా బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. ఆసుపత్రి ఎదుట ఉన్న దేవతకు పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. **ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావని** ఈ వేడుకలకు చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని, బత్తుల జయమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్య శ్రీరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి ప్రియ, డాక్టర్ కావేరి, డాక్టర్ నజీమా, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అవినాష్, సీనియర్ అసిస్టెంట్లు జయమ్మ, కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్లు భాగ్యమ్మ, రజనీ లక్ష్మి, హెడ్ నర్సులు అనంత, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు. **పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ** దసరా పండుగను పురస్కరించుకొని ఆసుపత్రి పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని, డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్య శ్రీరావు చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం బతుకమ్మ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.విధి నిర్వహణతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వైద్యులు, సిబ్బంది బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఆసుపత్రి ప్రాంగణంలో పండుగ శోభను నింపింది.

# లాలాపురంలో సోఫోన్ ఫంగిసైడ్ నూతన ఉత్పత్తి ఆవిష్కరణ



**కొణిజర్ల, అక్టోబర్ 13 (తొలి అక్షరం):** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురంలో ఎండోఫీల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన సోఫోన్ ఫంగిసైడ్ నూతన ఉత్పత్తిని మండల వ్యవసాయ అధికారి దొడ్డిగల్ల బాలాజీ ఆవిష్కరించారు. రైతు షేక్ సర్దార్‌మియా మిర్చి పంటలో అలెక్టో, క్యూబికో ఉత్పత్తులపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు ఉత్పత్తుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇలాంటి ప్రదర్శనలతో రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెరుగుతుందని వ్యవసాయ అధికారి బాలాజీ అన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్లు శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ రాఘవ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్తిక్, ఫీల్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్‌రెడ్డి, శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతీయ రహదారి65 బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశం
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్





**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 13:** జాతీయ రహదారి65పై బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ప్రజలు, వాహనదారులు, వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధికారులకు సూచించారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐలు సైదిరెడ్డి, ఆంజనేయులు, జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. **రెండు ప్రధాన మార్గాల పునరుద్ధరణకు నిర్ణయం** చిన్నకొండూరు రోడ్డు నుంచి తంగడపల్లి రోడ్డుకు రాకపోకల మార్గాన్ని పునరుద్ధరించాలని, వలిగొండ రోడ్డు వద్ద యూటర్న్ సదుపాయాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ రెండు మార్గాల్లో ప్రజలకు, వాహనదారులకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. **క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన** సమావేశం అనంతరం చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కౌన్సిలర్లు, అఖిలపక్ష నాయకులు, జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ప్రతినిధి, ఆర్‌కేపీపీఎల్ జనరల్ మేనేజర్ వి.ఆర్. జోషితో కలిసి చిన్నకొండూరు, వలిగొండ రోడ్ల వద్ద నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల రాకపోకలకు వీలుగా తగిన మార్గాలను ఏర్పాటు చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు.పట్టణ అభివృద్ధి ఎంత ముఖ్యమో ప్రజల ప్రయాణ సౌకర్యం, వ్యాపారస్తుల ప్రయోజనాలు కూడా అంతే ముఖ్యమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాక చిరంజీవి యాదవ్, బద్రి గాలయ్య, పస్తం గంగారాములు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చింతల సాయిలు, బత్తుల దాసు, దేప రాజు, బత్తుల శ్రీశైలం, కామిశెట్టి భాస్కర్, ఊదరి యాదయ్య, సీపీఐ నాయకుడు పగిళ్ల మోహన్ రెడ్డి, అన్నమోని గోవిందు, బీజేపీ నాయకుడు గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసుల వెంకటేశం, శ్యామ్ ప్రసాద్, చెరుకు శివకుమార్, ఉప్పాగుల శీను, జనసేన నాయకుడు ప్రవీణ్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు కామిశెట్టి వెంకటేష్, కమిశెట్టి చంద్రశేఖర్, అలిసేరు వీరాస్వామి, పోలోజు మాధవచారి పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో అన్నపూర్ణాదేవి అవతారంలో దుర్గమ్మ దర్శనం!

- పద్మశ్రీ డా. గజం గోవర్ధన్‌సుజాత దంపతుల సౌజన్యంతో ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 13:** చౌటుప్పల్‌లోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్న 37వ వార్షిక శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో చేనేత పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాన్ని పద్మశ్రీ డా. గజం గోవర్ధన్‌శ్రీమతి గజం సుజాత దంపతుల సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవ కమిటీ అధ్యక్షులు గోలి శ్రీనివాస్, బత్తుల యశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు బడుగు జయప్రకాష్, ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్, కార్యవర్గ సభ్యులు కర్నాటి జనార్ధన్, ధర్మకర్తల మండలి సభ్యులు బడుగు లక్ష్మయ్య, వనం ధనుంజయ, గుర్రం పాండురంగ, శ్రీ మారుద్వతి దేవాలయం అధ్యక్షులు గుర్రం నర్సింహ, గౌరవ సలహాదారు గోశిక భాస్కర్, దుర్గాదేవి దీక్షాపరులు గోశిక పురుషోత్తం, దుర్గా మాతృమండలి సభ్యులు బడుగు సావిత్రి, నోముల శ్రీలత, వనం వెంకటమ్మతో పాటు యువతీ యువకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలకు భక్తులందరూ హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం, శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

# మందోళ్లగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ తంగేళ్ల వెంకటేష్, ఉపసర్పంచ్ డాక్టర్ సురుకంటి శ్రీధర్ రెడ్డి



**తొలి అక్షరం/చౌటుప్పల్ అక్టోబర్ 13:** మందోళ్లగూడెం గ్రామ ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో మందోళ్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈరోజు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తంగేళ్ల వెంకటేష్, ఉపసర్పంచ్ డాక్టర్ సురుకంటి శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌చార్జి బాలమణి, పీఏసీఎస్ డైరెక్టర్ నల్ల నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు యాట వెంకటేష్, మానే రవికుమార్, గుండు శ్రీశైలం, పద్మశాలి సంఘం డైరెక్టర్ బీమయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి, బోరం వెంకట్ రెడ్డి, బోరం శేఖర్ రెడ్డి, పగిళ్ల అంజిరెడ్డి, యాట సత్తయ్య, సురుకంటి ప్రభాకర్ రెడ్డి, కందగట్ల రామకృష్ణ, కాటం నరేష్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించడంతో గ్రామస్థులు పాల్గొని కార్డులను స్వీకరించారు.

# మహాదానాల్లో అన్నదానం మహాశ్రేష్ఠం!

- భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**తొలి అక్షరం/చౌటుప్పల్. అక్టోబర్ 13:** మహాదానాల్లో అన్నదానం మహాశ్రేష్ఠమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలో భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ అన్నదానం ద్వారా ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్వేత ప్రియాంక, మూల సుధీర్ మాట్లాడుతూ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. యువత సామాజిక సేవలో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, భవాని యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు వరగంటి రాజేందర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గోపగోని లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడు వరగంటి మహేందర్ గౌడ్, కన్వీనర్ బొబ్బిళ్ల సుభాష్ కుమార్ పాల్గొన్నారు. అలాగే మారుపాక శ్రీశైలం గౌడ్, మునుకుంట్ల చంద్రశేఖర్, వరగంటి అమరేందర్ గౌడ్, కాసాని సాయికుమార్ గౌడ్, అవిరేణి ప్రభాస్ రాజ్, దండేపల్లి శివ, బొబ్బిళ్ల ఉత్తేజ్, వరగంటి వరుణ్ కుమార్ గౌడ్, దండేపల్లి శంకర్, మారుపాక మహేష్ గౌడ్, వినయ్, ఉడుగు గౌతమ్ గౌడ్, ఏర్కాలి అభిరామ్ గౌడ్, బిజిలి బబ్లు, మారుపాక రామ్ చరణ్ గౌడ్, వినీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగను కలిసిన నెల్లికుదురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

- కొత్తగా ఎన్నికైన నాయకులకు ఉద్యమ కార్యాచరణపై దిశానిర్దేశం
- నేరడ గ్రామంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీర్వాదం పొందిన నాయకులు
- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచన



**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 13:** కొరివి మండలం నేరడ గ్రామానికి మంద కృష్ణ మాదిగ వచ్చిన సందర్భంగా నెల్లికుదురు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తుల వెంకన్న మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కడారి ఐలయ్య మాదిగ, జిల్లా సీనియర్ నాయకుడు దండేపల్లి సైదులు మాదిగ, మండల కార్యదర్శి హెచ్. అశోక్ మాదిగ, కడారి శ్రీకాంత్ తదితర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు భవిష్యత్తు కార్యాచరణపై మంద కృష్ణ మాదిగ సూచనలు చేశారు. నెల్లికుదురు మండలంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ సంఘాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాలని, ఉద్యమ ఆదేశాలను పాటించాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన సూచనలను పాటిస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఆలయం వద్ద సాగర్ల ఐలమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి హాజరై అన్నవితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగుల వెంకటరెడ్డి, ఆవుల పద్మ నరసింహ, ముత్యాల సుజాత రవి ఉప సర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు ముత్యాల కిషన్, కట్ట కుమార్, సాత్విక, చిన్నపాక రమేష్, నాగటి ఉపేందర్, నోముల ఉమా నరసింహ, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్నారం గ్రామంలో మూడవరోజు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్న అమ్మవారు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించారు ఈ పూజా కార్యక్రమంలో ఎన్నారం గ్రామ సర్పంచ్ దంపతులు వెలగపూరి జనని.నర్సింహారావు మూడవ వార్డు నెంబర్ గన్నబోయిన మురళీ దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో గురు భవాని కొండూరు శంకర్. పరమేష్ నరేష్ సునీల్ సురేష్ నవీన్ వసంత రమ్య హరిప్రసాద్ వైష్ణవి వినయ్ మచ్చ గిరి రిత్విక్ వైష్ణవి లక్కీ.గ్రామ ప్రజలు భక్తులు తదితరులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు

# ఏనుమాముల మార్కెట్‌లో గుమస్తాల సంఘం రైతులకు సహకరించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడ్డి శ్రీనివాస్



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ గుమస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షులు సుంచు జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి వంగరి వెంకటేశ్వర్లును తెలంగాణ రైతు సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తమ పంటలను విక్రయించేందుకు తీసుకువచ్చినప్పుడు వారికి న్యాయమైన ధర లభించేలా చూడాలన్నారు. పంటల తూకం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,పట్టీలు పెట్టే సమయంలో మార్కెట్ బైలాలో నిర్దేశించిన నిబంధనలకు మించి ఎలాంటి అదనపు ఖర్చులు రైతులపై మోపకుండా చూడాలని సూచించారు. రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పంటలు పండించి మార్కెట్‌కు తీసుకువస్తారని, అటువంటి రైతులకు న్యాయం జరిగేలా గుమస్తాల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో సంఘం తన వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊరటి హంసాల్ రెడ్డి,కమిటీ సభ్యులు బొల్లు ఎల్లయ్య, సిరుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామన్నపేట పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, శివాలయం, ఎంప్లాయిస్ కాలనీ, గౌండ్ల కాలనీలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంప్లాయిస్ కాలనీలో వినాయక మిత్ర మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమార్చన, అభిషేకం, హోమం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మునిపంపులలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** రామన్నపేట మండలం, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులు గాదె అనిత భర్త ఇంద్రయ్య, మెంటే అండాలు కి గ్రామంలోని బొడ్రాయి వద్ద అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు యాదాసు యాదయ్య, ప్రధాన కార్యదర్శి కంభంపాటి రమేష్, వార్డు సభ్యులు కట్ట అరుణ్ కుమార్, జామలొద్దీన్, బాదే బిక్షం, భాషపాక యాదయ్య, రచ్చ రమేష్, నోముల అశోక్ రెడ్డి, మేకల ముత్యాలు, బత్తిని అంజయ్య, యండి జఫర్, గాదె ప్రభాకర్, కునూరు భాస్కర్, చింత మునేష్, శ్రీధర్ చారి, మేకల జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట పోలీసులకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రం



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** పలు దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించినందుకు రామన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ జి సతీష్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రం అందజేశారు. బంగారం దొంగతనం, రాగి (కాపర్) దొంగతనం, మేకల దొంగతనంతో పాటు పలు ఇతర కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ జి సతీష్ తో పాటు కానిస్టేబుల్స్ ప్రశాంత్, ప్రవీణ్, సురేష్, సత్యం సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సిరిపురంలో మూడవ రోజు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు





**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 13:** రామన్నపేట మండలం, సిరిపురం: గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గణపతి పూజ, స్వామివారి అభిషేకం, నవగ్రహ పూజ, హోమం నిర్వహించారు. ఈరోజు పూజా కార్యక్రమాన్ని జెల్లా అంజయ్య, ధర్మపత్ని అనసూయదంపతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు రాపోలు రమేష్, అర్చకులు గోపాలచార్యులు, అప్పం రాములు, చెన్నోజ్ సత్యనారాయణ, ఉపేంద్ర చారి, సింగం వినయ్ కుమార్, జెల్లా సాయికుమార్, సిల్వెర్ లక్ష్మయ్య, జెల్లా సుజాత తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ దేవి దుర్గమ్మ అలంకరణ



**తొలి అక్షరం/దంతాలపల్లి /అక్టోబర్ 13:** దంతాలపల్లి మండల కేంద్రంలో శివపుత్ర యూత్ అద్వారంలో దుర్గామాతను మూడో రోజు అన్నపూర్ణ దేవి అవతారంలో అలంకరించారు వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అందంగా తీర్చిదిద్దారు దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మహేష్.యాకన్న. రామ్.నాగరాజు.శ్రీను. కిరణ్ రాము.తదితరులు పాల్గొన్నారు

## దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా

# సుఖసంతోషాలతో ఉండాలి

**- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి**





**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 13:** దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి,శిల్ప దంపతులు ఆకాంక్షించారు. మంగళవారం నాడు గ్రామంలోని మార్కండేయ కాలనీలో ఏర్పాటుచేసిన దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకుని ఎడ్ల మహేందర్రెడ్డి శిల్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎడ్ల మహేందర్ రెడ్డి శిల్ప దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భవాని దీక్షలో ఉన్న భక్తులు, బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి మరియు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి**




**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 13:** కామినేని హాస్పిటల్(ఎల్బీనగర్) వారు గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి అన్నారు. వారం నాడు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ వారి సహకారంతో వెల్లంకి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి విచ్చేసి వైద్య సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కామినేని హాస్పిటల్స్ వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంఎంతో అభినందనీయమని, పేద ప్రజలకు ఇలాంటి వైద్య సేవలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మంగళంపల్లి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు, జ్వరం, జలుబు, నీరసం మరియు నొప్పులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాజికవేత్త ఎం. బసప్పకు పూలే జాతీయ అవార్డు

- దేవునిపల్లి బిడ్డకు జాతీయ గుర్తింపు.. బసప్పకు అరుదైన గౌరవం
- నవంబర్ 15న న్యూఢిల్లీలో బసప్పకు పూలే జాతీయ అవార్డు ప్రదానం




**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** షాద్ నగర్ నియోజకవర్గం లోని ఫరూక్ నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త, కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎం. బసప్ప మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డు2026కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు కమిటీ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ బసప్పకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతితోపాటు సామాజిక సేవ, ప్రజా ఉద్యమాలు, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వారిని గుర్తిస్తూ అకాడమీ ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోంది. నవంబర్ 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్న అకాడమీ 20వ జాతీయ మహాసభల్లో బసప్పకు పురస్కారాన్ని అందజేయనున్నారు. దేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. గ్రామానికి చెందిన బసప్ప జాతీయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల స్థానికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# సేవే లక్ష్యం.. సంస్కృతి పరిరక్షణే ధ్యేయం!

**విద్య, వైద్యం నుంచి బతుకమ్మ వేడుకల వరకు ఇ.ఎల్.వి. భాస్కర్ సేవలు**

**చౌటుప్పల్‌లో ఘనంగా రాచకొండ బతుకమ్మ వేడుకలు**





**తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 13:** విద్య, వైద్యం, సామాజిక సేవతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇ.ఎల్.వి. భాస్కర్ తన ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నారు. పాఠశాలలకు బస్సులు, కంప్యూటర్లు అందించడం, పేదలకు వైద్య సహాయం, అన్నదానం, రక్తదానం వంటి కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్నారు. రాచకొండ దసరా ఉత్సవ సమితి, ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాచకొండ బతుకమ్మ వేడుకల్లో భాగంగా మంగళవారం చౌటుప్పల్ మండలంలో మూడో రోజు సంబరాలు ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాలు, చౌటుప్పల్ పట్టణం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. భాస్కర్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తూనే, తెలంగాణ పండుగల వైభవాన్ని కాపాడేందుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై బీసీ సేన ఆగ్రహం

- బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలి
- ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గౌరవించాలి: కేశమోని శ్రీనివాస్



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** షాద్‌నగర్: మెదక్‌లో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేశమోని (సదర్) శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. తన ధైర్యసాహసాలు, పోరాట పటిమతో ప్రజల్లో స్ఫూర్తిని నింపిన ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం సమాజ ఐక్యతకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి, త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీనివాస్ పేర్కొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై బీసీ సేన ఆగ్రహం

- నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి
- బీసీ సమాజ ఆత్మగౌరవంపై దాడి: ప్యాట జయ శ్రీకాంత్



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్13:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసం ఘటనపై బీసీ సేన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్యాట జయ శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు, ఆటోనగర్ ప్రాంతంలో అక్టోబర్ 13 తెల్లవారుజామున జరిగిన ఘటనను ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ఐలమ్మ విగ్రహంపై దాడి చేయడం బీసీ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం, పోలీసులు వెంటనే స్పందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహాలకు పటిష్ఠమైన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.

# మహిళా సేవా సమితికి బతుకమ్మ శాలువా వేలం భారీ డిమాండ్

**- రూ.5.11 లక్షలకు శాలువా దక్కించుకున్న కంకంటి మంజులా రెడ్డి**



**తొలి అక్షరం/షాద్‌నగర్,అక్టోబర్ 13:** బతుకమ్మ సంబరాలు మహిళల ఐక్యతకు, సేవాభావానికి వేదికగా నిలిచాయి. షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో మంగళవారం రెడ్డి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బతుకమ్మ శాలువా వేలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేలంలో శాలువా రికార్డు స్థాయిలో రూ. 5,11,119 ధర పలికింది.మాజీ సర్పంచ్, మాజీ సింగిల్ విండో చైర్‌పర్సన్ కంకంటి మంజులా రెడ్డి వేలంలో శాలువాను దక్కించుకున్నారు. మహిళా సేవా సమితి కార్యక్రమాలకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేలం ద్వారా గణనీయమైన మొత్తం సమకూరింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్ట్ ఎల్. మోహన్ రెడ్డి వేలం ప్రక్రియను నిర్వహించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని రెడ్డి మహిళా సేవా సమితి భవన నిర్మాణానికి వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.బతుకమ్మ పండుగను సంప్రదాయ వేడుకగా మాత్రమే కాకుండా, మహిళా సేవా కార్యక్రమాలకు నిధులు సమకూర్చే వేదికగా మలచడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది.

# షాద్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక**

**మహిళల ఆటపాటలతో బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో పండుగ శోభ**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. రెడ్డి సేవా సమితి మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వలయాకారంగా తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో గార్డెన్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ వేడుకల్లో మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సతీమణి అగ్గనూర్ జగదేవి, కౌన్సిలర్ అగ్గనూర్ విశాల విశ్వం, వాణిశ్రీ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.పలువురు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

# 26వ వార్డులో నూతన స్ట్రీట్‌లైట్ ఏర్పాటు

**వార్డులో మెరుగైన వెలుతురు కోసం చర్యలు**

**చీకటికి చెక్.. 26వ వార్డులో కొత్త వీధి దీపం**

**ప్రజా సౌకర్యమే లక్ష్యం.. స్ట్రీట్‌లైట్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ఎస్పీ శివ**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డులో ప్రజల సౌకర్యార్థం నూతన స్ట్రీట్‌లైట్‌ను ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ ఎస్పీ శివ ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు చేపట్టారు. రాత్రివేళల్లో వీధుల్లో చీకటి కారణంగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించడంతోపాటు, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వెలుతురు సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు.వీధి దీపాల ఏర్పాటు వల్ల స్థానికులకు రాత్రి సమయంలో రాకపోకలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా పాదచారులు, వాహనదారులకు మెరుగైన వెలుతురు అందనుంది. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ పనులు చేపడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌన్సిలర్ ఎస్పీ శివకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో మరిన్ని సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

**- 36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం,విలువ రూ.20 లక్షలు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** రాష్ట్ర వ్యాప్తంగా వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠా ఆటకట్టించారు బేగంపేట్ పోలీసులు.ఇద్దరు పాత నేరస్థులను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి ఏకంగా 20 లక్షల విలువైన 36 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...మల్కాజ్‌గిరి కమిషనరేట్ బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెరేడ్ గ్రౌండ్స్ ప్రాంతంలో గత ఎనిమిది నెలలుగా వరుసగా బైక్‌లు మాయమవుతుండటంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.ఎస్‌హెచ్‌ఓ పి. సైదులు, డిఐ జి. శ్రీనివాస్ నేతృత్వంలోని క్రైమ్ టీమ్, డీసీపీ డి. శ్రీధర్, ఏసీపీ పి. గోపాలకృష్ణమూర్తి మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే గతంలో ఈ కేసుతో సంబంధం ఉన్న ఎ-3 సప్పిడి రాజకుమార్‌ను అరెస్ట్ చేసి 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తును మరింత వేగవంతం చేసిన పోలీసు బృందం, ఈ నెల 12న పెద్దపల్లిలో నిందితులు ఎ-1, ఎ-2 లను పట్టుకుని వారి నుంచి మరో 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**నకిలీ తాళాలతో చోరీలుగొర్రెల కాపరులు, రైతులే లక్ష్యం:** మంచిర్యాల జిల్లా చిన్నారానికి చెందిన (ఎ-1) పాత నేరస్థుడు.తెలంగాణవ్యాప్తంగా ఇతనిపై 24కు పైగా కేసులు ఉన్నాయి.జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ పాత దారిలోనే పడ్డాడు. మైదానాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కూరగాయల మార్కెట్లలో పార్క్ చేసిన బైక్‌లను నకిలీ తాళాలు ఉపయోగించి చోరీ చేసేవారు. అనంతరం తాము సెకండ్ హ్యాండ్ డీలర్లమని నమ్మించి రైతులు, కూలీలకు రూ.8వేల నుండి రూ.12లకే విక్రయించేవారు. మల్కాజ్‌గిరి, వరంగల్, హైదరాబాద్, సైబరాబాద్, సిద్ధిపేట, రామగుండం కమిషనరేట్ల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి ఈ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రైమ్ టీమ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

**పోలీసుల హెచ్చరిక:** సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆర్‌సి,ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానాస్పదంగా తక్కువ ధరలకు ఇచ్చే వాహనాలను కొనుగోలు చేసి చట్టపరమైన చిక్కుల్లో పడవద్దని మల్కాజ్‌గిరి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ద్విచక్ర వాహనాల లాకులను కనీసం ఏడాదికి ఒకసారైనా మార్చుకోవాలని,దనపు యాంటీ థెఫ్ట్ లాక్‌లు వాడాలని సూచించారు.

# 20వ వార్డులో జెట్ మిషన్‌తో డ్రైనేజీ శుభ్రత

**• కౌన్సిలర్ గోపాల్ చొరవతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** షాద్‌నగర్ పట్టణంలోని 20వ వార్డులో డ్రైనేజీ జామ్ కావడంతో కౌన్సిలర్ గోపాల్ ఆధ్వర్యంలో శుభ్రత పనులు చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో జెట్ మిషన్ ద్వారా డ్రైనేజీని శుభ్రం చేయించారు. మురుగు నీరు సక్రమంగా ప్రవహించక స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూశారు. వార్డులో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ గోపాల్ తెలిపారు. ప్రజలు డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయకుండా సహకరించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో వార్డులో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఉప్పల్‌లో టీ-20 క్రికెట్ ఫీవర్..భారీ ట్రాఫిక్ ఆంక్షలు జారీ

**• నేడు భారత్ -వెస్టిండీస్ 4వ టీ-20 పోరు • ఉప్పల్ స్టేడియం చుట్టూ పటిష్టమైన ట్రాఫిక్ మళ్లింపులు • ప్రయాణికులు,వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి • నగరం మరో క్రికెట్ పోరుకు సర్వం సిద్ధమైంది • మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా భారత్‌వెస్టిండీస్ జట్ల మధ్య నేడు అత్యంత కీలకమైన 4వ అంతర్జాతీయ టీ-20 మ్యాచ్ జరగనుంది.ఈ రసవత్తర పోరును కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలివస్తుండటంతో, ఉప్పల్ ప్రాంతంలో భారీ ఎత్తున ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రేక్షకులు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.మ్యాచ్ జరిగే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11.50 గంటల వరకు ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో కఠినమైన ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. **భారీ వాహనాలపై నిషేధం - మళ్లింపు మార్గాలు ఇవే:** స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా లారీలు, రాకెట్ లారీలు,డంపర్లు,ట్రక్కులు,టిప్పర్లు, వాటర్ ట్యాంకర్లు,ఆర్ఎంసి వాహనాలు,జేసీబీలు, ప్రైవేట్ బస్సులు, ట్రాక్టర్ల రాకపోకలపై పూర్తి నిషేధం




విధించారు. ఈ వాహనాలను క్రింది ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చేవి: మెహ్‌ఫిల్ హోటల్ సమీపంలోని హెచ్‌ఎండిఏ ఉప్పల్ భగాయత్ ఎంట్రన్స్ వద్దే నాగోల్ - ఎల్.బి. నగర్ వైపు మళ్లిస్తారు. ఎల్.బి. నగర్ నుంచి వచ్చేవి: నాగోల్ మెట్రో స్టేషన్ యూ-టర్న్ నుంచి హెచ్‌ఎండీఏ భగాయత్, టయోటా యూ-టర్న్, బోడుప్పల్, చెంగిచెర్ల మీదుగా ఐఓసీఎల్ చెర్లపల్లి లేదా ఘట్‌కేసర్ వైపు పంపిస్తారు. తార్నాక / రామంతాపూర్ నుంచి వచ్చేవి: హబ్సిగూడ ఎక్స్ రోడ్స్ / స్ట్రీట్ నంబర్ 8 నుంచి నాచారం, ఎన్ఎఫ్‌సీ రోటరీ, ఐఓసీఎల్ చెర్లపల్లి మీదుగా ఘట్‌కేసర్ మార్గానికి మళ్లిస్తారు. వరంగల్ - హైదరాబాద్ హైవే: వరంగల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కి అబ్దుల్లాపూర్‌మెట్ - ఎల్.బి. నగర్ మీదుగా వెళ్లాలి. తిరుగు ప్రయాణంలోనూ ఇదే రూట్ ఫాలో కావాలి. **పార్కింగ్ ప్రాంతాల పూర్తి వివరాలు:** మ్యాచ్‌కు వచ్చే సాధారణ ప్రేక్షకుల కోసం స్టేడియం చుట్టూ 5 ప్రధాన పార్కింగ్ స్థలాలను కేటాయించారు. 1. స్టేడియం వెలుపల (సాధారణ ప్రేక్షకుల కోసం): ఉప్పల్ ఎక్స్ రోడ్స్ - హబ్సిగూడ రూట్: టీజీ ఐఏఎల్ఏ పార్కింగ్ ప్రాంతం. ఉప్పల్ ఎక్స్ రోడ్స్ - రామంతాపూర్ రూట్: డీఎస్ఎల్ మాల్ పక్కన ఉన్న జైన్ ప్రాపర్టీస్ ఖాళీ స్థలం. మోడ్రన్ బేకరీ వద్ద ప్రత్యేక పార్కింగ్ స్థలం. ఎన్ఎస్ఎల్ భవనం ఎదురుగా ఉన్న డీఎస్ఎల్ ఓపెన్ ప్లేస్. 2. స్టేడియం లోపల (పాస్‌దారులకు మాత్రమే): కేవలం విఐపీలు, వివీఐపీలు,అధీకృత పాస్‌లు ఉన్న వాహనాలకు మాత్రమే స్టేడియంలోని ఏ గ్రౌండ్ పార్కింగ్ అనుమతిస్తారు. ఈ వాహనాలు కచ్చితంగా గేట్ నంబర్ 1ఏ గుండా మాత్రమే లోపలికి వెళ్లాలి. పాస్‌లు లేని వాహనాలను ఈకే మినార్, ఎల్జీ గోడౌన్ చెక్‌పోస్టుల దాటనివ్వరు. స్టేడియానికి వచ్చే క్రికెట్ అభిమానులు ఎవరూ కూడా సొంత కార్లు, బైకులను రోడ్లపైకి తెచ్చి ట్రాఫిక్ సమస్య సృష్టించవద్దని పోలీసులు కోరారు.సాధ్యమైనంత వరకు మెట్రో రైలు ,,ఆర్టీసీ ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రయాణికులు ముందే తమ రూట్లను బేరీజు వేసుకుని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై బీసీ జనసేన ఆగ్రహం

**- దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలి: కత్తి చంద్రశేఖర అప్ప**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 13:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర అప్ప డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు, ఆటోనగర్ ప్రాంతంలో అక్టోబర్ 13 తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బీసీ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం సమాజ విలువలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహానికి రక్షణ కల్పించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే నాగరాజు విజన్‌పై విమర్శలు హాస్యాస్పదం

**- కాంగ్రెస్ ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్**

**- 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ఎమ్మెల్యే కమిట్‌మెంట్‌కు నిదర్శనం**

**- గత పాలనలోని అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** ప్రజల సంక్షేమం,అభివృద్ధి, పేదలకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి కొలమానమని.. కేవలం విమర్శలు చేయడం, రాజకీయం మాట్లాడటమే విజన్‌కు నిర్వచనం కాదని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ ధ్వజమెత్తారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు విజన్ లేదంటూ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యే నాగరాజు పనితీరును విమర్శించే హక్కు ఆరూరి రమేష్‌కు లేదని స్పష్టం చేశారు.విమర్శలు చేసే ముందు గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ఏ విభాగానికి ఎంత నిధులు తీసుకొచ్చారు? ఏం అభివృద్ధి చేశారో ప్రజల ముందు



పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి, పనులు చేపడుతుండటమే పేదల సంక్షేమం పట్ల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకున్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. **విజన్ అంటే ఆర్భాటపు మాటలు కాదు..ప్రజా సంక్షేమం:** అభివృద్ధిపై సవాల్: పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, అర్హులకు ఫలాలు చేర్చడం, విద్యా-వైద్య రంగాలకు ప్రాధాన్యమిచ్చి ప్రజా సమస్యలు తీర్చడం విజన్ కాదా?అని మోహన్ గౌడ్ నిలదీశారు.గత బీఆర్ఎస్ హయాంలో ఏ గ్రామానికి ఎంత అభివృద్ధి చేశారు, ఎంత నిధులు తెచ్చారో తేల్చేందుకు తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. దైవభక్తిపై విమర్శలు చిల్లర రాజకీయం: ఎమ్మెల్యే నాగరాజుకు దైవభక్తి లేదంటూ చేస్తున్న విమర్శలను ఖండించారు. దేవుడి సన్నిధిలో భక్తులందరూ సమానమేనని, ఆలయాల వద్ద ఆర్భాటాల కంటే అంతర్గత భక్తి, సేవాభావం, సమానత్వమే ముఖ్యమని స్పష్టం చేశారు. భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడమే నిజమైన ధార్మిక దృక్పథమని చెప్పారు. **ప్రజా కోర్టులోనే తీర్పు:** వ్యక్తిగత ఆరోపణలు మాని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్మాణాత్మక చర్చకు రావాలని మోహన్ గౌడ్ హితవు పలికారు. ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, వచ్చే రోజుల్లో ప్రజలే ఎవరి విజన్ ఏమిటో సరైన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు.

# రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబుకు ఘన సన్మానం

**• బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చేతన్ శౌర్యకు ఆర్థిక సాయం**

**• రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో సత్కార సమారోహం**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా నూతన చైర్మన్‌గా ఎన్నికైన బేతి అశోక్ బాబును రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు రొటేరియన్ సోమ వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించినలో పలువురు ప్రముఖులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ చిరంజీవి చేతన్ శౌర్య క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో క్లబ్ తరఫున ప్రోత్సాహకంగా ఆర్థిక సాయం అందించారు. అలాగే రెడ్‌క్రాస్ సభ్యుడు, రొటేరియన్ తోట సంపత్‌తో పాటు వరంగల్ జిల్లా ఫోటోగ్రఫీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రొటేరియన్ వంగరి వేణుగోపాల్‌ను వేదికపై ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించడం, వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని కొనియాడారు. రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ కార్యదర్శి రొటేరియన్ నాయిని అనిల్ కుమార్, జూలూరి కృష్ణమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ పోరాడ్ల రత్నాకర్, కుమారస్వామి, కోరే చంద్రమౌళి, కొడం రాజేందర్, సుంకనపల్లి శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం







**తొలి అక్షరం/పత్తికొండ అక్టోబర్ 13:-** సుదీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతగానో దోహదపడుతుందని ప్యానెల్ న్యాయవాది సూరజ్ నబీ, మధ్యవర్తిత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని స్టేట్ బ్యాంక్, ఆదోని రహదారి ప్రాంతాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించుకోవచ్చో వివరించడంతో పాటు, ప్రజలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, ఇరుపక్షాల మధ్య పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోదగిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కేసుల పరిష్కారానికి ఇరుపక్షాల కక్షిదారులకు న్యాయస్థానం ద్వారా ఉచిత మధ్యవర్తిత్వ న్యాయవాదుల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆర్. శ్రీనివాస్ నాయక్, న్యాయవాది మదన్ గోపాల్ గౌడ్, లోక్ అదాలత్ ప్రతినిధి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నిత్య పూజేశ్వరుని తలనీలాల వేలం రూ.4.84 లక్షలు



**తొలి అక్షరం/సిద్ధవటం అక్టోబర్ 13:** లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర స్వామివారి కార్తీక మాస తలనీలాల వేలంపాట రూ.4,84,000లకు ప్రొద్దుటూరుకు చెందిన మునిశేఖర్ దక్కించుకున్నారు. మంగళవారం సిద్ధవటంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ప్రొద్దుటూరు, గుంతకల్, చాపాడు, వంతాటిపల్లి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. దేవస్థానం నిర్ణయించిన రూ.3 లక్షల కనీస ధరను అధిగమించి, మునిశేఖర్ అత్యధికంగా రూ.4.84 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు కార్తీక మాసంలో భక్తులు స్వామివారికి మొక్కుబడిగా సమర్పించే తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకవర్గ సభ్యుడు శివారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**- ఏఎస్పీ జై శర్మకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు**




**తొలి అక్షరం/ఆదోని అక్టోబర్ 13:-** మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టి, వారికి సత్వర న్యాయం అందించేందుకు ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సంజయ్, శశిధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోని ఏఎస్పీ జై శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం మహిళా పోలీస్ స్టేషన్ కర్నూలులో ఉండటంతో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల మహిళలు ఫిర్యాదుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. సుమారు 120 నుంచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం, రవాణా సౌకర్యాల కొరతతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గృహ హింస, కుటుంబ సమస్యలు, వేధింపులు, లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు మహిళా పోలీసు అధికారులు అందుబాటులో ఉండటం అవసరమన్నారు. ఐదు నియోజకవర్గాల మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదోనిలో మహిళా సీఐతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి, ఆదోనిలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో మంగళగౌరి అమ్మవారు



**తొలి అక్షరం/సిద్ధవటం అక్టోబరు 13:-** మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరి సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు మంగళగౌరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అలంకారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# జీతాలివ్వకుంటే సమ్మె తప్పదు

**● నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల ధర్నా**

**● నాలుగు నెలలుగా వేతనాలు లేక దుర్భర జీవితాలు ● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలు వచ్చి వంటలు, పిండివంటలతో ఇళ్లు కళకళలాడుతుంటే.. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతూ, భద్రత కల్పిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల ఇళ్లలో మాత్రం పస్తులుండే దుస్థితి నెలకొంది. గత నాలుగు నెలలుగా వేతనాలు అందక వారు విలవిలలాడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజుల వ్యవధిలో ఆసుపత్రి అధికారులకు రెండు పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో.. నిరసనగా మంగళవారం ఉదయం రెండు గంటల పాటు కార్మికులు పనులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెబుతున్న వాస్తవానికి, నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని మండిపడ్డారు. పండుగ పూట కూడా జీతాలు ఇవ్వకపోవడం, అధికారులలో కనీస చలనం లేకపోవడం అత్యంత అన్యాయమన్నారు. రోగులకు వైద్యం అందే పవిత్రమైన ఈ ఆసుపత్రిలో సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతోనే ప్రస్తుతానికి పాక్షిక నిరసనతో ఆగాం. ఒకవేళ ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించకపోతే రాబోయే రోజుల్లో సమ్మెను సైతం ఉద్ధృతం చేస్తాం అని ఎం. నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు.

**బిల్లుల చెల్లింపులో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం:** సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా..గత 10 నెలలుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు రాలేదని, అయినప్పటికీ తన సొంత వనరుల నుంచి ఆరు నెలల జీతాలు చెల్లించానని ఆయన వివరించినట్లు నరసింహ పేర్కొన్నారు. పది నెలలుగా కార్మికుల బిల్లులు విడుదల చేయకుండా అధికారులు జాప్యం చేయడం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందన్నారు. తక్షణం ఆసుపత్రి అధికారులు స్పందించి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కార్మికుల బకాయి వేతనాలన్నీ వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు క్రాంతి, భాస్కరాచారి, నిరంకారీ, తులసి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపారు.

# ఎమ్మెల్సీ సమరానికి కాంగ్రెస్ వ్యూహాలు

**- ఢిల్లీలో సీఎం,టీపీసీసీ అధ్యక్షుడితో భేటీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**- పట్టభద్రుల స్థానంలో కైవసమే లక్ష్యంగా దిశానిర్దేశం**

**- సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** రాబోయే హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపోరులో కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగురవేసేందుకు ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా జాతీయ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు సహా పార్టీ అధిష్ఠాన ముఖ్య నేతలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కీలక భేటీలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని స్థానిక రాజకీయ పరిస్థితులు, గెలుపు వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ..గ్రాడ్యుయేట్ స్థానంలో హస్తం పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ అధినాయకత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. ఎన్నికల సన్నద్ధత, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు ప్రక్రియ, ఓటర్ల అవగాహన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో నాయకులు,కార్యకర్తల సమన్వయంపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తాం. పార్టీ హైకమాండ్ సూచనల మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు శ్రేణులన్నింటినీ సమాయత్తం చేసి పూర్తి సహకారం అందిస్తాం అని శ్రీగణేష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ విజయం కోసం ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఐక్యంగా శ్రమిస్తారని, నియోజకవర్గంలో గరిష్ఠ స్థాయిలో ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పులివెందుల అర్బన్ పీఎస్ కమాండ్ కంట్రోల్ హెల్ప్‌లైన్ ప్రారంభించిన ఎస్పీ




**ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయమే లక్ష్యం**

**కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్**

**తొలి అక్షరం/పులివెందుల అక్టోబర్ 13:** ప్రజలకు రక్షణ,సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 9490864264 ను వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ, ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో లేదా సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా ఈ నంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ప్రతి కాల్‌పై సిబ్బంది వెంటనే స్పందించి,క్షేత్రస్థాయిలో బాధితులకు తగిన సహాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రాధాన్యత అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్ అర్బన్ సీఐ పురుషోత్తం రాజు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రణ్‌బీర్ 'రామాయణ' నుంచి జటాయువు పోస్టర్




రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్-1' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'జటాయువు' పాత్రకు సంబంధించిన తొలి పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ ఈ పాత్రకు తన గొంతును అందించనున్నారు. 'ది వింగ్స్ అఫ్ ధర్మ' (ధర్మ రెక్కలు) పేరుతో విడుదలైన పోస్టర్‌లో జటాయువు తీక్షణమైన చూపులు ఆకట్టుకుంటున్నాయి. మరో దృశ్యంలో ఆ భారీ పక్షి రెక్కలు విప్పి కనిపిస్తోంది. ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకున్న చిత్రబృందం.. రావణుడు సీతను అపహరించినప్పుడు అతడిని ఎదిరించేందుకు జటాయువు చూపిన ధైర్యాన్ని గుర్తుచేసింది. విజయం కోసం కాకుండా ధర్మం కోసం పోరాడిన వీరుడిగా జటాయువును అభివర్ణించింది. సినిమా ప్రచారంలో భాగంగా ఇప్పటికే పలు పాత్రల పోస్టర్లను విడుదల చేయగా.. తాజాగా జటాయువు పోస్టర్‌ను పరిచయం చేసింది.నితేశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవిదూబే నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్.. డీఎన్‌ఈజీ, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.'రామాయణం' తొలి భాగాన్ని 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమా విడుదల కానుంది.ఇటీవల ముంబైలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి అంతర్జాతీయ యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ హాజరయ్యారు. రణ్‌బీర్, సాయిపల్లవి, నిర్మాత నమిత్ మల్హోత్రా కూడా పాల్గొన్నారు. అయితే కార్యక్రమం సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో మీడియా ప్రతినిధుల నుంచి విమర్శలు వచ్చాయి.ఇదిలా ఉండగా, శ్రీరాముడి పాత్ర కోసం రణ్‌బీర్ మాంసాహారం, మద్యానికి దూరంగా ఉన్నారంటూ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ మార్పులన్నీ ప్రత్యేకంగా సినిమా కోసమే చేశారనే విషయంపై స్పష్టత లేదు. ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే ప్రయత్నంలో భాగంగా శాకాహారాన్ని స్వీకరించడం, మద్యం, ధూమపానాన్ని మానేయడం గురించి రణ్‌బీర్ గతంలో మాట్లాడారు.

# శ్రీవారి సన్నిధిలో 'రణబాలి' జంట.

## విజయ్, రష్మిక ప్రత్యేక పూజలు



టాలీవుడ్ క్రేజీ పెయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా తమ కొత్త చిత్రం 'రణబాలి' విడుదల సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీరిద్దరూ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'రణబాలి' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుండగా, దానికి ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి వచ్చిన విజయ్, రష్మిక ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దర్శనం అనంతరం వారు హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం.'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్-రష్మిక జంటగా నటిస్తున్న మూడో చిత్రం కావడంతో 'రణబాలి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఇప్పటికే విడుదలైన పాటలు, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం ఈ నెల 16న దసరా పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దీనిని తెరకెక్కింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషించడం సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు.ప్రస్తుతం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన చిత్ర బృందం, ఈరోజు ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో ప్రేక్షకుల్లోకి సినిమాను మరింతగా తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అయితే, దేశవ్యాప్తంగా సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# యంగ్ బ్యూటీకి పాన్ ఇండియా జాక్ పాట్!

నాలుగేళ్ల క్రితం కన్నడ సినీపరిశ్రమ నుంచి అద్భుతమైన జానపద కథతో బ్లాక్ బస్టర్ సినిమా వచ్చింది. ఆ తర్వాత 2025లో వచ్చిన ప్రీక్వెల్ కూడా బంపర్ హిట్టు కొట్టి ఆ హీరో, నిర్మాణ సంస్థలకు గొప్ప ఆదాయం, అంతకుమించిన పేరును కూడా తెచ్చిపెట్టింది. కేజీఎఫ్ తర్వాత అదే స్థాయిలో వరుస పెట్టి పాన్ ఇండియా విజయాలు దక్కడంతో కన్నడ పరిశ్రమలో కొత్త జోష్ కూడా వచ్చింది. ఆ తర్వాత చాలా మంది వరుసగా పాన్ ఇండియా సినిమాలు ట్రై చేస్తూనే ఉన్నారు.

ఇదిలా ఉంటే పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ సంగతి ఎలా ఉన్నా.. ఆ ఫ్రాంఛైజీలో నటించిన హీరోకి, నిర్మాణ సంస్థకు మధ్య వివాదాలు సద్దుమణగలేదన్న చర్చ వేడెక్కించేస్తోంది. బాలీవుడ్ లో కరణ్ జోహార్- కార్తీక్ ఆర్యన్ ఇష్యూలా ఈ ఇష్యూ కూడా ఏదో ఒక రోజు సెటిలయ్యేదే. కానీ ఇప్పటికీ ఇంకా వారి మధ్య పొరపొచ్చాలు తగ్గలేదని గుసగుస వినిపిస్తోంది. బ్లాక్ బస్టర్ ప్రీక్వెల్ చాప్టర్ 1 విడుదలై ఇప్పటికి ఏడాది పూర్తి కాగా.. నిర్మాణ సంస్థ పేరును మెన్షన్ చేయకుండా హీరో, అలాగే హీరో పేరును ప్రస్థావించకుండా నిర్మాణ సంస్థ సోషల్ మీడియాల్లో వార్షికోత్సవ పోస్టును షేర్ చేయడంతో వారి మధ్య ఇంకా ఏదీ సెట్ రైట్ కాలేదని అర్థమైంది. అలాగే అదే చిత్రంలో నటించిన హీరోయిన్ కి, హీరోకి మధ్య కూడా కొన్ని విభేధాలొచ్చాయని.. వారి మధ్య కూడా మాటల్లేవనే ప్రచారం అప్పట్లో సాగింది. సరిగ్గా ఇదే కారణంతో తెలుగులో బ్లాక్ బస్టర్ ఫ్రాంఛైజీలో తన సరసన ఆ హీరోయిన్ నటించాల్సి ఉన్నా ఆ హీరో అవకాశం కల్పించలేదని గుసగుస వినిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే వరుస హిట్లతో దూసుకుపోతున్న మమిత భైజుతో రీప్లేస్ చేసారని తెలుస్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లహాం కుటుంబం చిత్రాలతో బంపర్ హిట్లు అందుకున్న ఈ యువనటి జాక్ పాట్ కొట్టినట్టేనన్న చర్చ సాగుతోంది. హీరోలతో సత్సంబంధాలు లేకపోతే అరుదైన అవకాశాలు ఛేజారుతాయనడానికి ఇది ఒక ఉదాహరణ. అయితే అదే సమయంలో మరో ప్రతిభావనికి ఆ అవకాశం దక్కింది. అయితే దీనిపై ఇంకా అధికారికంగా చిత్రబృందం ధృవీకరించాల్సి ఉంది. పాన్ ఇండియాలో బిగ్ ప్లానింగ్ తో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్/ ప్రీక్వెల్ సినిమాకి సంబంధించిన అధికారిక అప్ డేట్స్ ఇకపై విడుదల కానున్నాయని సమాచారం



# డిసెంబర్ 4న ఆర్య 'హలో కాదల్' విడుదల..

## ఆసక్తి రేపుతున్న టీజర్




తమిళ నటుడు ఆర్య కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హలో కాదల్'. ఆర్య కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో నిఖిలా విమల్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.విడుదల తేదీ ప్రకటనతో పాటు మేకర్స్ ఒక ఆసక్తికరమైన టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. విమానంలో నిఖిలా విమల్, వైష్ణవి చైతన్య సంభాషించుకుంటున్న దృశ్యంతో ఈ టీజర్ ప్రారంభమవుతుంది. వైష్ణవి తన ప్రేమకథ గురించి వివరిస్తుండగా, అందులో ఆర్య కనిపిస్తారు. అయితే, తన భర్తతో తనకున్న ప్రేమకథ అంతకంటే ఆసక్తికరంగా ఉంటుందని నిఖిల చెబుతుంది. ఆమె భర్త పాత్రలో కూడా ఆర్యనే కనిపించడంతో కథలో ఏదో వైవిధ్యమైన మలుపు ఉందని స్పష్టమవుతోంది.మలయాళంలో విజయవంతమైన 'ప్రణయ విలాసం' చిత్రానికి దర్శకత్వం వహించిన నిఖిల్ మురళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తుండగా, జీవా శంకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్ నెలలోనే పూర్తికాగా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆర్య, సాయేషా తమ సొంత నిర్మాణ సంస్థ 'ది షో పీపుల్' బ్యానర్‌పై కిషోర్ టితో కలిసి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# ఊటీలో కీలక షెడ్యూల్ ప్రారంభం

విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా తాజా షెడ్యూల్‌ను చిత్ర బృందం ఊటీలో ప్రారంభించింది. సుందరమైన ప్రకృతి అందాల నడుమ ఈ షెడ్యూల్ జరగనుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి, అజయ్ ఘోష్, ఉపేంద్ర లిమాయే సహా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో రెండు అద్భుతమైన పాటలతో పాటు కథలో కీలకమైన పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఊటీలోని ప్రకృతి అందాలు ఈ సన్నివేశాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి విజయవంతమైన కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.



# "ఆలోచనలు మారుతూ ఉంటాయి"..

## డేటింగ్ వ్యాఖ్యలపై శోభిత ధూళిపాళ్ల వివరణ!

నటుడితో డేటింగ్ చేయనని గతంలో చేసిన వ్యాఖ్యలపై నటి శోభిత ధూళిపాళ్ల స్పందించింది. అప్పట్లో తన ఆలోచనలు వేరుగా ఉండటంతో అలా చెప్పానని తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఆలోచనలు మారుతుంటాయని చెప్పింది. పరిస్థితులకు అనుగుణంగా అభిప్రాయాలు మార్చుకోవడంలో తప్పులేదని అభిప్రాయపడింది. ప్రేమంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదని శోభిత పేర్కొంది. అది ఇద్దరి మనసుల కలయిక అని వివరించింది. ఎప్పుడూ ఒకేలా ఆలోచించడం కంటే మార్పును స్వీకరించడం ముఖ్యమని అభిప్రాయపడింది.వ్యక్తిగత జీవితంపై వచ్చే వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదని శోభిత సూచించింది. సమాజంలో అభిప్రాయాలు మారుతుంటాయని, వాటిని పట్టించుకుంటూ పోతే మనల్ని మనం కోల్పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. మన వ్యక్తిత్వంపై స్పష్టతతో ఉండాలని చెప్పింది. శోభిత, నాగచైతన్య 2024లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad